
ఫలితాలపై ఉత్కంఠ

- మిగిలింది 7 రోజులే..
- గెలుపు ధీమాలో అభ్యర్థులు
- ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ


విశాఖ దక్షిణ నియోజకవర్గం ముఖ చిత్రం

డాబాగార్డెన్స్: సార్వత్రిక ఎన్నికల లెక్కింపునకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ నెల 13న పోలింగ్ జరగగా జూన్ 4న లెక్కింపు జరగనుంది. పోలింగ్‌కు కౌంటింగ్‌కు ఈసారి మూడు వారాలు సమయం ఉండడంతో అందరిలోనూ ఒకటే టెన్షన్ నెలకొంది. గతంతో పోల్చుకుంటే ఈసారి కౌంటింగ్ ప్రక్రియలో పలు మార్పులు చోటు చేసుకోవడంతో ఫలితం ఎన్ని గంటలకు వస్తుంది? తుది ఫలితం వెలువడేసరికి ఎంత సమయం పడుతోంది? సర్వీస్, పోస్టల్ బ్యాలెట్ ఓట్లే కాదు. గతంతో పోల్చుకుంటే ఈవీఎంల్లో కూడా ఈసారి ఓటర్లు భారీగాఓటెత్తడంతో ఫలితాలు వెల్లడయ్యే సరికి ఎంత సమయం పడుతుందన్న ఉత్కంఠ నెలకొంది.

అభ్యర్థుల భవితవ్యం తేలేది ఇక్కడే..

విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గానికి సంబంధించి అభ్యర్థులు భవితవ్యం(ఓట్ల లెక్కింపు) ఆంధ్ర విశ్వకళాపరిషత్ కంప్యూటర్ సైన్స్ బ్లాక్‌లోని ఈ–క్లాస్ రూమ్‌లోనూ, పార్లమెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా అదే బ్లాక్‌లోని కంప్యూటర్ ఆర్గనైజేషన్ అండ్ ఆర్కిటెక్చరల్ ఎంబైడెడ్ సిస్టం ఐటీ ల్యాబ్‌లోని ఫస్ట్‌ఫ్లోర్ రూమ్ నెంబరు ఎఫ్ఎఫ్–2లో తేలనుంది.

పోటీలో 16 మంది

2024–29కి సంబంధించి విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి 16 మంది పోటీపడ్డారు. వీరిలో బహుజన్ సమాజ్ పార్టీ నుంచి కదిరి రాము, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి సంతోష్‌కుమార్, భారతీయ రాష్ట్రీయ దళ్ నుంచి గుంటు దుర్గాప్రసాద్, ప్రజాప్రస్థానం పార్టీ నుంచి బూర శ్రీనివాసరావు, జైభారత్ నేషనల్ పార్టీ నుంచి రావాడ తాతారావు, జనసేన పార్టీ నుంచి సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, జాతీయ జనసేన పార్టీ నుంచి వంశీకీర్తి కుమార్ బుద్ధవరపు, జైమహాభారత్ పార్టీ నుంచి కె శ్రీదేవి, సమాజ్‌వాదీ పార్టీ నుంచి సూరాడ ఎల్లాజీతో పాటు ఇండిపెండెంట్లుగా కడగల ఈశ్వరరావు, కిలపర్తి మంగరత్నం, డోల జగదీష్, తారకరామ్ లగిశెట్టి, బిపిన్ కుమార్ జైన్ పోటీలో నిలిచారు.

డిసైడ్ చేసేది వీరే..

విశాఖ దక్షిణ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించేందుకు 1,37,474 మంది ముందుకొచ్చారు. వీరిలో 66,260 మంది పురుషులు, 71,209 మంది మహిళలు కాగా ఐదుగురు ట్రాన్స్ జెండర్లు ఉన్నారు.

2009 నుంచి 2019 వరకు..

2009 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్ గెలుపొందారు. 35.66 శాతంతో 45,971 ఓట్లతో ద్రోణంరాజు గెలుపొందగా..35.40 శాతంతో 45,630 ఓట్లతో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసిన కోలా గురువులు ఓటమి పాలయ్యారు. వీరిద్దరి మధ్య ఓట్ల వ్యత్యాసం కేవలం 341. తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన వాసుపల్లి గణేష్‌కుమార్ 18.78 శాతం ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇదిలా ఉండగా 2014 ఎన్నికల విషయానికొస్తే..51.45 శాతంతో 66,686 ఓట్లతో వాసుపల్లి విజయం సాధించగా..కోలా గురువులు 48,370 ఓట్లతో ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల విషయానికొస్తే వాసుపల్లి గణేష్‌కుమార్ తన సమీప ప్రత్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌పై 3,729 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆయన పాలన నచ్చి వాసుపల్లి గణేష్‌కుమార్ వైఎస్సార్‌సీపీలో చేరారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్ పోటీ చేశారు.

క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న వాసుపల్లి


స్వామి సన్నిధిలో వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: సింహాచలం సింహాద్రి అప్పన్నను వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం దర్శించుకున్నారు. ముందుగా స్వామికి తులసి మాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం కప్పస్తంభం ఆలింగనం చేసుకొని స్వామిని వేడుకున్నారు. చందనంలో ఇమిడి ఉన్న వరహాస్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని వాసుపల్లి తెలిపారు.

దర్గాలో వాసుపల్లి ప్రార్థనలు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: ఇషాక్ మదీనా ఔలియా దర్గా షరీఫ్‌ను సోమవారం దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ దర్శించుకున్నారు. జీవీఎంసీ 39వ వార్డులో కోటవీధిలో ఉన్న ఈదర్గాకు వాసుపల్లి చద్దర్‌ను మెట్లమార్గంలో ద్వారా తీసుకువెళ్లి మజార్‌పై వేశారు. అనంతరం అక్కడ మతపెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సౌత్ మైనార్టీ అధ్యక్షులు ముజీబ్‌ఖాన్, కో ఆప్షన్ సభ్యులు షరీఫ్, షబీర్, హమీద్, హామీల్, కమల్, ఇబ్రహీమ్, సలీం, సత్య, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు


మెయిన్‌రోడ్డు ఆంజనేయ స్వామి విగ్రహం

మహారాణిపేట: మెయిన్‌రోడ్డు శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో జూన్ ఒకటో తేదీన జరగనున్న హనుమజ్జయంతికి ఏర్పాటు చేస్తున్నారు. ఆరోజు ఉదయం 5.30 గంటల నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, సింధూర పూజ నిర్వహించనున్నారు. రూ.216 చెల్లించి వారి పేరు, గోత్రనామాలతో పూజ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం తెలిపారు.

108 వాహనాల రికార్డులు పరిశీలన


వాహనంలో రికార్డులను పరిశీలిస్తున్న 108 జోనల్ మేనేజర్ నజీర్

మహారాణిపేట : గర్భిణులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటి నుంచి ఆస్పత్రికి తరలించాల్సిన అంశాలను ఈఎంటీలకు 108 విభాగ జోనల్ మేనేజర్ నజీర్ వివరించారు. సోమవారం ఆయన కేజీహెచ్ గైనిక్, అత్యవసర వార్డులను సందర్శించి, రోగులను ఏ విధంగా పెద్దాస్పత్రికి తరలిస్తున్నారో వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 102,104,108వాహనాల్లో మందుల కొరత ఉండకూడదని, వాహనాలు కూడా శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం 108 రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో 108 విభాగ విశాఖ సిటీ కో–ఆర్డినేటర్ ఎం.సురేష్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణార్జున సహిత విశ్వరూప విగ్రహ ప్రతిష్ట


వేడుకల్లో ప్రత్యేక పూజలు

డాబాగార్డెన్స్: పాతనగరం వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలోని గీతా భవనంలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణార్జున సహిత విశ్వరూప భగవానుని పాలరాతి మూర్తులు ప్రతిష్ఠించి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని 25వ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మంగళధ్వని, వేదమంత్రాలు, సంప్రదాయ రీతిన జరిపారు. ఓం నమో భగవతే వాసుదేవాయ ద్వాదశాక్షరి కోటి లిఖిత మహా యజ్ఞంతో కూడిన స్థూపాన్ని ప్రారంభించారు. సంఘ సేవకుడు కొప్పుల రామ్‌కుమార్ ఈ స్థూపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవన్నామ స్మరణ చేస్తూ పరమాత్మునిచే ప్రసాదించబడిన ఈ జీవితాన్ని ధన్యం చేసుకోవాలన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని లక్ష మల్లెలతో అర్చన, 108 మామిడి ఫలాలతో అష్టోత్తర శతనామార్చన, కుంకుమార్చనతో సామూహిక సంపూర్ణ గీతా పారాయణ జరిపారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ప్రవచనకర్త ఎం నాగేశ్వరరావు, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీనరసింహ, కనకవల్లీ, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగ్గురమ్మల జాతర


అంగటిదిబ్బలో వెలసిన ముగ్గురు అమ్మవార్లు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29, 30 వార్డుల గ్రామ దేవతలు పోలమ్మ, ముత్యాలమ్మ, నూకాలమ్మ 24వ జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవార్ల ఘటాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, మేళ తాళాలు డప్పు వాయిద్యాల నడుమ సాగింది. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని అంగటిదిబ్బ, రామజోగిపేట, భుజంగరావుపేట, దండుబజార్, దిబ్బలపాలెం, చందకవీధి, కుమ్మరవీధి, కృష్ణానగర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. పలువురు ప్రముఖులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మంగళవారం అమ్మవార్ల జాతర మహోత్సవం వేడుకగా నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరపనున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


పరతాపు రాజేష్

మర్రిపాలెం: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం గెడ్డ వీధిలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న పరతాపు రాజేష్ ఓ మందుల షాపులో పనిచేస్తున్నాడు. ఇతడికి సుమారు పదేళ్ల నుంచి మతిమరుపు ఉంది. తల్లి మందులు వేసుకోమని చెప్పినందుకు ఆమెతో గొడవపడి ఈ నెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇప్పటి వరకు చేరుకోలేదు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌లో ఉంది. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అతడి తల్లి రాణి ఫిర్యాదు చేసినట్టు సోమవారం పోలీసులు తెలిపారు. రాజేష్ 5.2 అంగుళాల పొడవు, తెల్లరంగు ఛాయతో ఉంటాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు నల్ల జీన్ ఫ్యాంట్, గళ్ల షర్ట్ ధరించి ఉన్నాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు. హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేపట్టారు.

వినోదంతో పాటు విజ్ఞానం


విద్యార్థులకు స్ఫూర్తిదాయక కథలు చెబుతున్న సంజీవకుమార్

డాబాగార్డెన్స్: వేసవి విజ్ఞాన శిబిరాలు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తాయని పాఠ్యపుస్తక రచయిత డి.సంజీవకుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీసేందుకు ఇటువంటి శిబిరాలు దోహదపడతాయన్నారు. స్ఫూర్తిని కలిగించే కథలు వివరించారు. అనంతరం విద్యార్థులు రంగు పేపర్లతో పలు రకాల బొమ్మలు తయారు చేశారు. వచ్చే నెల 7వ తేదీ వరకు విజ్ఞాన శిబిరం కొనసాగుతుందని ఇన్‌చార్జ్ డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మజ్జిగ, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాజేంద్రవర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యన్నదాన సేవకుడికి సత్కారం


శ్రీరామ్మూర్తిని సత్కరిస్తున్న స్వామి వివేకానంద సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్: వారణాసి పుణ్యక్షేత్రంలో హనుమాన్ ఘాట్ వద్ద క్షత్రియ సేవా సంఘం ద్వారా కాశీ పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు నిత్యాన్నదానం ద్వారా సేవలందిస్తూ, హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న క్షత్రియ సేవా సంఘం సేవకుడు శ్రీరామ్మూర్తిని స్వామి వివేకానంద సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదని, ఎంతో ఆప్యాయంగా, కాశీ పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు సేవలందిస్తున్న శ్రీరామ్మూర్తి సేవలు అభినందనీయమని, అటువంటి సేవకుడ్ని సత్కరించుకోవడం సంతోషకరంగా ఉందని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఉమాదేవి, కనకమహాలక్ష్మి, రాణి, సుజాత, రత్న పాల్గొన్నారు.

విజయవంతంగా రోబోటిక్ మోకాళ్ల మార్పిడి చికిత్సలు


రోబోటిక్ శస్త్ర చికిత్సల గురించి వివరిస్తున్న డాక్టర్ రవిచంద్ర బృందం

ఆరిలోవ: హెల్త్ సిటీలోని అపోలో ఆస్పత్రిలో రోబోటిక్ ఆర్మ్ ఉపయోగించి 25 మోకాలు మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. డాక్టర్ వి.రవిచంద్ర ఆధ్వర్యంలో డాక్టర్ రఘు యలవర్తితో కలిసిన బృందం ఈ రోబోటిక్ శస్త్రచికిత్సలు అత్యున్నతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిచంద్ర మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతితో పోల్చితే రోబోటిక్ శస్త్ర చికిత్స ఖచ్చితమైన ఫలితాలు అందిస్తాయన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 250 మంది ఎంపిక


ఎంపికైన వారితో నిర్వాహకులు

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, జేసీఐ భారత్ యువ సంకల్ప్ కన్సల్టెన్సీ సంయుక్తంగా క్యాంపస్ డ్రైవ్ నిర్వహించాయి. సర్వీస్, ఫైనాన్స్, బీమా, సాఫ్ట్‌వేర్ రంగాలకు సంబంధించి 32 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ విభాగాలకు సంబంధించి 650 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొనగా, 250 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు ప్రారంభించిన కార్యక్రమంలో గ్లోబల్ ట్రస్ట్ నుంచి పి శ్రీనివాసరావు, జేసీఐ అధ్యక్షుడు చంద్రశేఖర్, అమెజాన్ హెచ్ఆర్ ఆర్ సునీల్, ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి, వివిధ పరీక్షల ద్వారా పలువుర్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ జి శంకరనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

దప్పిక తీరుస్తున్న దాతలు

- పలు కూడళ్లలో చలివేంద్రాల నిర్వహణ
- మజ్జిగ, రస్నా పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు


జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సభ్యులు


వెంకటేశ్వరమెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



సంగం శరత్ రోడ్లో జీవీఎంసీ చలివేంద్రం

అల్లిపురం : విశాఖలో చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. మండుటెండలో బాటసారుల కోసం వివిధ స్వచ్ఛంద సంస్థలతోపాటు జీవీఎంసీ కూడా పలుకూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశాయి. వేసవి ప్రారంభం నుంచి నగరంలో చాలా చోట్ల దాతలు చలివేంద్రాలు నిర్వహిస్తున్నారు. కొబ్బరి ఆకులు, తాటి ఆకులతో చలువపందిళ్లు నిర్మించి, వాటి కింద కొత్త కుండలతో నీటిని నింపి ప్రజలకు తాగునీరు, మజ్జిగ, రస్నాలు పంపిణీ చేస్తున్నారు. దీంతో స్వచ్ఛంద సంస్థల ప్రతనిధులు తమ విధులను నిరాటంకంగా నిర్వహిస్తున్నారు. అల్లిపురంతో పాటు దక్షిణ నియోజకవర్గంలో నీలమ్మవేపచెట్టు వద్ద జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15ఏళ్లగా చలివేంద్రం నిర్వహిస్తున్నారు. వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో దశాబ్ద కాలంగా చలివేంద్రం నిర్వహిస్తున్నారు. అల్లిపురం గాంధీ బొమ్మ వద్ద శ్రీ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆరేళ్లుగా చలివేంద్రం నిర్వహిస్తున్నారు.

జీవీఎంసీ ఆధ్వర్యంలో..

జీవీఎంసీ ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా పలు కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసింది. తాటాకులతోను, గ్రీన్‌మ్యాట్స్‌తో నిర్మించిన చలివేంద్రంలో చల్లటి మంచినీటిని అందిస్తోంది. దీంతో నగర ప్రజలు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. ప్రతి ఏడాది వేసవి కాలంలో జీవీఎంసీ చలివేంద్రాలు నిర్వహించడం విశేషం.

15 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం



15 ఏళ్లుగా నీలమాంబ యూత్ అసోసియేషన్, జీకే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చలివేంద్రం నిర్వహిస్తున్నాం. ప్రతి ఏడాది మే రెండో వారం నుంచి చలివేంద్రం ఏర్పాటు చేసి నీటిని పంపిణీ చేస్తున్నాం. చల్లటి నీటితో పాటు ప్రతి శనివారం మజ్జిగ కూడా అందజేస్తున్నాం.

– భీశెట్టి గోపికృష్ణ, చైర్మన్, జీకే ఫౌండేషన్

గ్రంథాలయం ఆధ్వర్యంలో..



వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో దశాబ్దకాలంగా చలివేంద్రం నిర్వహిస్తున్నాం. ప్రతి శనివారం మజ్జిగ పంపిణీ చేస్తున్నాం. దాతలు స్వచ్ఛందంగా వచ్చి ఆర్థిక సహకారం అందజేస్తున్నారు.

– శరగడం భాస్కరరావు, ఉపాధ్యక్షుడు, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం

ప్రజలకు ఉపయోగకరం



చలివేంద్రాలు ద్వారా బాటసారుల దాహార్తిని తీరుస్తున్నాం. మండే ఎండలకు నోరు తడారిపోయి దాహం వేసిన వారికి అందుబాటులో చలివేంద్రాలు ఉంటున్నాయి. ప్రతి శనివారం మజ్జిగ, రస్నాలు అందజేస్తున్నాం.

– బొట్టా రమేష్

పైడితల్లి అమ్మవారికి సారె సమర్పణ


సారెతో మహిళల ఊరేగింపు

గాజువాక : పాత కర్ణవానిపాలెం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ మహోత్సవాల్లో భాగంగా గ్రామంలోని మహిళలు అమ్మవారికి సోమవారం సారె సమర్పించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు వివిధ రకాల పళ్లు, స్వీట్లతో ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి సారెను అందజేశారు. మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ నిర్వహించనున్న నేపథ్యంలో సారెను సమర్పించినట్టు గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు. పెద్ద పండగ సందర్భంగా బళ్ల వేషాలతో ఊరేగింపుతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ పెద్దలు కరణంరెడ్డి నర్సింగరావు, కరణం కనకారావు, సిరసపల్లి అప్పారావు, మడగల కన్నయ్య, గొంతిన దేముడు, కరణంరెడ్డి రాము, సాలాపు నూకరాజు, కరణం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం వంటలపై పోటీలు


పోటీల్లో వంటలను ప్రదర్శిస్తున్న దృశ్యం

గాజువాక : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంటలపై కుక్ కమ్ హెల్పర్లకు సోమవారం పోటీలను నిర్వహించారు. మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీలకు 40 మంది కుక్‌లు హాజరయ్యారు. వారు వారం మొత్తం అందజేస్తున్న మెనూపై పోటీలను నిర్వహించారు. ఎవరు ఏ వంటకం చేయాలన్న విషయాన్ని లాటరీ ద్వారా ఎంపిక చేసి పోటీలు నిర్వహించారు. అనంతరం ముగ్గురు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వంటలు వండే ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. శుభ్రత విషయంలో పాటించాల్సిన అంశాలను వివరించారు. యూ ట్యూబ్ ద్వారా లభించే చిట్కాలను కూడా ఉపయోగించుకుని మరింత రుచికరమైన భోజనాలను విద్యార్థులకు అందించాలని విద్యాశాఖాధికారులు సూచించారు. మండల విద్యాశాఖాధికారులు బి.విశ్వనాథం, ఎం.సునీత పాల్గొన్నారు.